అసంపూర్తిగా వంటషెడ్ల నిర్మాణం

- వరండాల్లోనే వంట
- ఇబ్బంది పడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

చెన్నూర్‌రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చదువుతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో వంట గదులు నిర్మించడానికి గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఈజీఎస్‌)లో 2016లో ఒక్కో వంటషెడ్డుకు రూ.2లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. కొన్నిచోట్ల వంటషెడ్డులు నిర్మించినా, మరికొన్ని చోట్ల నిర్మించకపోవడంతో మధ్యాహ్నభోజన నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో మొత్తం 21గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. అధికారులు ఆ పనులను అప్పటి సర్పంచులకు అప్పజెప్పడంతో, వారు తమ జేబుల్లోంచి డబ్బులు ఖర్చు చేసి కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తి చేసినా సకాలంలో బిల్లులు అందకపోవడంతో వారు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ కారణంతో చాలా మంది వాటి నిర్మాణాలపై ముందుకు రాకపోవడంతో కొన్ని చోట్ల అసంపూర్తిగా, కొన్ని చోట్ల పునాదుల దశల్లోనే ఉన్నాయి. కొమ్మెర, పొక్కూరు, సుద్దాల గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కాగా, నారాయణపూర్‌లో పునాది దశలోనే ఉండగా, మిగితా చోట్ల లెంటల్‌ లెవల్‌ నిర్మాణాలయ్యాయి.


కిష్టంపేటలో అసంపూర్తిగా వంటషెడ్డు


వరండాలో వంట కోసం ఏర్పాటు చేసిన పొయ్యిలు

విద్యాశాఖకు అప్పగింత...
2018లో విద్యాశాఖకు వంటషెడ్ల నిర్మాణాలు అప్పగించినా, ఫలితం లేకుండా పోయింది. మెనూ ప్రకారం రుచికరమైన వంటలు తయారు చేసేందుకు నిర్వాహకులకు వంట గదులు లేకపోవడంతో తిప్పలు పడుతున్నారు. చాలా చోట్ల పాఠశాలల ఆవరణల్లో, రేకుల కింద వంట చేస్తున్నారు. గాలి వీచినా, వర్షం పడినా కట్టెలు సరిగ్గా మండక, సరిగా ఉడకడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని వంటషెడ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం
ప్రభుత్వ పాఠశాలల్లో వంటషెడ్ల నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరు అయినప్పటికీ ఒకటి, రెండు చోట్ల మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగితా చోట్ల పూర్తి కాలేదు. ప్రస్తుతం 'మనఊరు–మనబడి' కింద పనులు పూర్తి చేయిస్తున్నాం.
– కె.రాధాకృష్ణమూర్తి, ఎంఈవో

క్లుప్తంగా

లబ్ధిదారుల ఎంపికకు ఇంటింటా సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్‌: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం రెవెన్యూ అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 1880మంది డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన వారిని గుర్తించేందుకు ఐదు టీమ్‌లు ఇంటింటికీ వెళ్లి రేషన్‌కార్డు, ఆదాయం, కులం, ఇంటి పన్ను తదితరవి పరిశీలిస్తున్నామని తహసీల్దార్‌ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోటపల్లి: మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో భాస్కర్‌ సూచించారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఈజీఎస్‌ సిబ్బంది, కార్యదర్శులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టిన నర్సరీ పనులు, ఈజీఎస్‌ గ్రామసభల్లో గుర్తించిన పనులపై ఎంపీడీవో భాస్కర్‌ అధికారులతో చర్చించారు. పారిశుధ్య పనులు ప్రతిరోజూ చేపట్టాలని, గ్రామస్తులు కార్యదర్శులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ నాగేందర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చలిమంట

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో ప్రమాదవశాత్తు చలిమంట అంటుకుని బుధవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. వన్‌టౌన్‌ ఎస్సై సంతోష్‌ కథనం ప్రకారం.. మున్సిపాలిటీలోని 24డీప్‌ ఏరియా బస్తీకి చెందిన దురిశెట్టి సారమ్మ(75) అనే వృద్ధురాలు మంచం పక్కనే చలిమంట ఏర్పాటు చేసుకుని, నిద్రలోకి జారుకుంది. ప్రమాదవశాత్తు మంచానికి నిప్పు అంటుకోవడంతో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యారంగం అభివృద్ధిపై చర్చించాలి


ర్యాలీ చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చెన్నూర్‌రూరల్‌: అసెంబ్లీలో విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చెన్నూర్‌లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్‌ కమిటీ కార్యదర్శి దుండిగాల అనిల్‌ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బారీ బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌పై పునర్‌ సమీక్ష చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ నాయకులు సురేష్‌, శేఖర్‌, నాగరాజు, మనోహర్‌, సంపత్‌, ఓదేలు, కార్తీక్‌, అంజన్న, శశి, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సోరకాయ	20
ఆకుగోబి	60
పూగోబి	70
క్యారెట్‌	50
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

– మంచిర్యాలఅగ్రికల్చర్‌



రోడ్డు పనులు ప్రారంభం



మంచిర్యాలటౌన్‌: జిల్లా కేంద్రంగా మారిన మంచిర్యాలలో ప్రధాన రహదారులకు కోట్ల నిధులు కేటాయించి, టెండర్లను నిర్వహించినా రోడ్డు పనులను ప్రారంభించడం లేదని ఈ నెల 6వ తేదీన సాక్షిలో 'రోడ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం' అనే కథనానికి మున్సిపల్‌ అధికారులు స్పందించారు. వైశ్య భవన్‌ నుంచి లక్ష్మీ థియేటర్‌ వరకు సీసీ రోడ్డును వేసేందుకు గాను రూ.7కోట్ల నిధులను కేటాయించి, టెండర్లను నిర్వహించినా పనులను పూర్తి చేయడంలో మున్సిపల్‌ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వైశ్యభవన్‌ నుంచి జెడ్పీ కార్యాలయం వరకు రోడ్డును ఏడాది క్రితమే తవ్వి వదిలేయడం వల్ల స్థానిక ప్రజలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఏడాదిగా ఎదుర్కొంటున్నారు. దీంతో 'సాక్షి'లో కథనం రాగా, రోడ్డు పనులను ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని రెండు రోజుల క్రితం సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో ఎట్టకేలకు బుధవారం నుంచి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

సాక్షి ఎఫెక్ట్‌..

అధికారుల పేర్లు రాయించారు..!



దండేపల్లి: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద గల సమాచార హక్కు చట్ట బోర్డుపై ప్రజా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పీలేట్‌ అధికారుల పేర్లు లేక ఖాళీగా కనిపించింది. దీంతో 'అధికారి పేరెక్కడ' అనే శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. సమాచార హక్కు చట్టం బోర్డుపై బుధవారం అధికారుల పేర్లు రాయించారు.

నల్లబ్యాడ్జీలు ధరించి వీఆర్‌ఏల నిరసన


కాసిపేట: నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు


నెన్నెల: నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

నెన్నెల: కామారెడ్డి జిల్లా అంచనూరు గ్రామ వీఆర్‌ఏ మన్నే దేవరాజ్‌ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వీఆర్‌ఏ యూనియన్‌ జిల్లా కన్వీనర్‌ దుర్గం శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. నెన్నెల తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బుధవారం వీఆర్‌ఏలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దేవరాజ్‌ మృతికి 5నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం శ్రీనివాస్‌ మాట్లాడుతూ పేస్కేల్‌, ప్రమోషన్‌, వారసులకు ఉద్యోగం కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అసెంబ్లీ బడ్జెట్‌లో వీఆర్‌ఏలకు ఎలాంటి కేటాయింపులు లేవని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం ఇచ్చిన మాట ప్రకారం జీవో విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ నాయకులు స్వామి, అక్బర్‌, బాపులు పాల్గొన్నారు.
కాసిపేట: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బుధవారం వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వీఆర్‌ఏ జేఏసీ ప్రధాన కార్యదర్శి కున్సోతు శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం కామారెడ్డి జిల్లా అంచనూరు గ్రామ వీఆర్‌ఏ దేవరాజు మృతికి 5నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి


మల్లారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాసిపేట: విద్యార్థులు సమాజంలో విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, మంచి విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అభ్యసించి ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని రిటైర్డ్‌ డైట్‌ ప్రిన్సిపాల్‌ ఆదిలాబాద్‌ తుమ్మల మల్లారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యా, నీతి, విలువలు అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఆయనను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రాథోడ్‌ రమేష్‌, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరీ, పల్లె కృష్ణగోపాల్‌రావు, జ్యోతి, అనసూర్య, అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో 'గడపగడపకూ బీజేపీ'


ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: మండలంలోని బీజేపీ నాయకులు బుధవారం పాత కొమ్ముగూడెం గ్రామంలో 'గడపగడపకూ బీజేపీ' కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు ఇంటి నిర్మాణానికి ఏడు లక్షల రూపాయలు అందించాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు పురుషోత్తం, ప్రభాకర్‌, బొప్పు సతీష్‌, హేమంత్‌రెడ్డి, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం
మందమర్రిరూరల్‌: మండలంలోని శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సండ్రోన్‌పల్లిలో బుధవారం బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బూత్‌ లెవల్‌లో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పోషం, దీక్షితులు, వెంకటేష్‌, రాజేందర్‌ తదితరులు ఉన్నారు.

'ఏసీడీ' రద్దు చేయాలి

భీమిని: ప్రభుత్వం విద్యుత్‌లో ప్రవేశపెట్టిన ఏసీడీ బిల్లులు రద్దు చేయాలని బీజేపీ కన్నెపల్లి మండల అధ్యక్షుడు బేర రామన్న యాదవ్‌ అన్నారు. కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామంలో బుధవారం బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్‌ 24గంటలు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యుత్‌ సరఫరాలో అధికంగా కోతలు పెడుతున్నారని ఆరోపించారు. రైతులకు 24గంటల విద్యుత్‌ ఇవ్వాలని, ఏసీడీ బిల్లును రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్‌, మండల ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌, నాయకులు వెంకటేష్‌, మంగయ్య, మల్లేష్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

రేపు కలెక్టరేట్‌ ముట్టడి


పత్తి రైతుల వివరాలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కాసిపేట: క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించి దళారుల నుంచి రైతులను కాపాడాలని ఈ నెల 10న చేపట్టిన 'చలో కలెక్టరేట్‌ ముట్టడి' ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. మండలంలో పత్తి రైతులను బుధవారం కలిసి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇళ్లలో నిల్వ ఉన్న పత్తిని పరిశీలించారు. రైతులు అప్పులు చేసి పంట పండిస్తే ధర లేకపోవడం వల్ల రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళారుల ఆటలు కట్టడి చేసి రైతులను ఆదుకోవాల్సింది పోయి చేతులెత్తేసి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వెంటనే పత్తి ధర పెంచాలని డిమాండ్‌ చేశారు. రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి 'చలో కలెక్టరేట్‌ ముట్టడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం బాపురాజు, లస్మయ్య, రత్నం రమేష్‌, సుధాకర్‌, శ్యాముల్‌ కుమార్‌, రాజ్‌కుమార్‌, దుర్గం రవి, బెజ్జూర్‌ మల్లేష్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

5,785 మందికి కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం 5,785మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 1,177మందికి రీడింగ్‌ గ్లాసెస్‌ను ఇవ్వగా, ప్రిస్క్రిప్షన్‌ అద్దాలు 1,038 మందికి ఇచ్చేందుకు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

సమస్యలపై పాదయాత్ర

తాండూర్‌: గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను తాండూర్‌ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాగం రాజారాం మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో జనగామ జిల్లా పాలకుర్తి నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పాదయాత్ర ఈ నెల 28వ తేదీన ముగుస్తుందని, ముగింపు రోజు హైదరాబాద్‌ ఇందిరా పార్కులో సభ జరుగుతుందని వివరించారు.

12న నూతన కమిటీ ఎన్నిక

దండేపల్లి: ఆదివాసీ తోటీ సేవా సంఘం జిల్లా నూతన కమిటీని ఈ నెల 12న మంచిర్యాలలో ఎన్నుకోనున్నట్లు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రవీందర్‌ తెలిపారు. అన్ని గ్రామాల కుల పెద్దలు, పటేళ్లు, మేదావులు, ఉద్యోగులు హాజరవ్వాలని కోరారు.

పత్తి సాగులో జాగ్రత్తలపై అవగాహన


రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్‌: యాసంగి పత్తి సాగులో రైతులు జాగ్రత్తలు పాటిస్తూ అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్‌, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తిరుపతి అన్నారు. మండలంలోని పెర్కపల్లిలో రైతులు సాగు చేస్తున్న యాసంగి పత్తి పంటను బుధవారం సందర్శించారు. పత్తి పంటలో పోషక లోపాలు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల పంట సక్రమంగా పెరగడం లేదన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ నీటి తడులు పెట్టడం ద్వారా మంచి పోషకాలు అంది పంట అధిక దిగుబడిని ఇస్తుందని సూచించారు. రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వినియోగించడం ద్వారా భూమి సారం కోల్పోయి పంటలకు సరైన పోషకాలు అందక మొక్కల ఎదుగుదల జరగదని తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఆస్ఫేట్‌ 75 ఎస్పీ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిసి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటల సాగుతో ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం సంధ్య, రైతులు ఉన్నారు.

పంట నిర్వహణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

రామకృష్ణాపూర్‌: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని రైతువేదికలో సంధ్య ఎడ్యుకేషనల్‌ అండ్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు పంట నిర్వహణ, క్రయ విక్రయాలపై అవగాహన కల్పించారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్న సంధ్య సొసైటీ ప్రతినిధులను పలువురు అభినందించారు.

వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమే

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ


ప్రజలతో మాట్లాడుతున్న సురేఖ

శ్రీరాంపూర్‌/మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): రాష్ట్రంలో, కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. హాత్‌సే హాత్‌ జోడో అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం నస్పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు వాటర్‌ ట్యాంక్‌ ఏరియాలో, హాజీపూర్‌ మండలంలోని దొనబండ గ్రామంలో ఆమె ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గడపగడపకూ వెళ్తూ కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అనంతరం న్యూ ఇయర్‌ క్యాలెండర్‌ను ఇంటింటికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్‌, ఫ్లోర్‌ లీడర్‌ సుర్మిళ్ల వేణు, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు ఆడెపు శ్యామల, కౌన్సిలర్లు, హాజీపూర్‌లో మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, మండల అధ్యక్షుడు తోట రవి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బలరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేయరూ..!

అటెన్షన్‌ ప్లీజ్‌..



దండేపల్లి: కడెం డిస్ట్రిబ్యూటరీ 25వ కాలువ పై దండేపల్లి మండలంలోని కళపెల్లి సమీపంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. దీంతో కాల్వ దాటేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.
సంబంధిత అధికారి : సంజీవ్‌, ఇరిగేషన్‌ ఏఈఈ
ఫోన్‌ నంబర్‌ : 9154951581

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం అందజేత
దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి సల్లూరి వనిత వివాహానికి దండేపల్లి సత్యసాయి భజన మండలి తరుపున 50కిలోల బియ్యాన్ని బుధవారం అందించారు. కన్నెపల్లికి చెందిన తాండ్ర సత్తయ్య–వనితల ఇద్దరు కూతుళ్ల వివాహ నిశ్చితార్థానికి మాజీ ఎంపీటీసీ నారాయణ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం
చెన్నూర్‌రూరల్‌/దండేపల్లి/మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. చెన్నూర్‌ మండలంలోని వెంకంపేటలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్‌ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, హాజీపూర్‌ మండలంలోని పెద్దంపేటలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత బుధవారం కంటివైద్య శిబిరాలను ప్రారంభించారు. దండేపల్లిలోని రాజుగూడ పంచాయతీ పరిధిలోని జైతుగూడలో సర్పంచ్‌ లచ్చుపటేల్‌ ప్రారంభించారు.

పల్లె ప్రకృతివనం సందర్శన
మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్‌ షెడ్‌, వైకుంఠధామాలను పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

కొనసాగుతున్న రోడ్డు మరమ్మతులు
దండేపల్లి: బాసర–లక్సెట్టిపేట రహదారికి, జన్నారం మండలం ఇందన్‌పల్లి నుంచి లక్సెట్టిపేట వరకు రూ.1.50కోట్లతో చేపట్టిన బీటీ పేవర్‌ ప్యాచ్‌వర్క్‌ పనులు కొనసాగుతున్నాయి. దండేపల్లి మండల కేంద్రం సమీపంలో బుధవారం ప్యాచ్‌వర్క్‌ పనులు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చేందుకు ఈ పనులు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ సుధాకర్‌ తెలిపారు.

ఆధార్‌ అనుసంధానాన్ని పూర్తి చేయాలి
వేమనపల్లి: ఉపాధి కూలీల ఆధార్‌ అనుసంధానం వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీలకు పని కల్పించాలని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలన్నారు. హరితహారంలో మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో బాపురావు, ఏపీవో సత్యప్రసాద్‌, ఈసీ మధుకర్‌, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.